ప్రజాశక్తి
శనివారం 3 ఆగస్టు 2024

తహశీల్దార్ల బదిలీల్లో స్వల్ప మార్పులు

పార్వతీపురం రూరల్ : జిల్లాలో 20మంది తహశీల్దార్లకు పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఉత్తర్వులు గతనెల 31న జారీచేసిన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ రెండోసారి శుక్రవారం కొన్నిమార్పులు, చేర్పులు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తాజా ఉత్తర్వులు ప్రకారం పార్వతీపురం తహశీల్దారుగా పి.సోమేశ్వరరావు, సీతానగరానికి జె.రాములమ్మ, బలిజిపేటకు జివి జనార్ధన్, భామినికి ఆర్.ఉమామహేశ్వర రావు, సీతంపేటకు పి.అప్పల రాజు, పాచిపెంటకు డి.రవి, కురుపాంకు ఎం.రమణమ్మ, పాలకొండకు ఆర్.బాలమురళీకృష్ణ, కొమరాడకు ఆర్.రమేష్‌కుమార్, గుమ్మలక్ష్మిపురానికి ఎన్.అప్పారావు, జియ్యమ్మవలసకు డివి సీతారామయ్యను తహశీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మక్కువ, వీరఘట్టం, గరుగుబిల్లి మండలాలకు తహశీల్దార్లను త్వరలోనే ప్రకటించనున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

తహశీల్దార్లు మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలాల్లో సమర్ధవంతమైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తహశీల్దార్లను ఆదేశించారు. తహశీల్దార్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ సమావేశం జరిగింది. రెవెన్యూ అంశాల పట్ల సానుకూలంగా స్పందించి మంచి పరిష్కారం చేయాలని స్పష్టం చేశారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిందేనని స్పష్టం చేశారు. సమస్యలపై ముఖ్యంగా భూ సమస్యల పట్ల క్షుణ్ణంగా విచారణ చేయాలని ఆదేశించారు. మండలాల్లో సంభవించే విపత్తులు, ఇతర సమస్యలను ముందుగా గుర్తించేలా వ్యవహరించాలన్నారు. గ్రామ స్థాయి సమాచారం పక్కాగా ఉండాలని, ఆర్ఓఎఫ్ఆర్, భూ సేకరణ, గృహ నిర్మాణం, తదితర అంశాలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పారిశ్రామిక తదితర అవసరాలకు జిల్లాలో లాండ్ బ్యాంక్ అవసరమని, అందుకు అవసరమగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, వి.వెంకటరమణ, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పోటీకి రంగం సిద్ధం

వైసిపి అధినేత సమక్షంలో నిర్ణయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఉమ్మడి విశాఖ పట్నం జిల్లా స్థానిక సంస్థల వైసిపి తరపు ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు ఖరారైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో జిల్లా నాయకత్వం ఏకగ్రీవంగా ఆమోదించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 13లోపు బొత్స నామినేషన్ వేయనున్నారు. అక్కడి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగావున్న వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఎన్నికలకు ముందు జనసేనలో చేరడం, ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం విధితమే. ఈనేపథ్యంలో ఈ స్థానం భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వైసిపి ముఖ్య నాయకులతో జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్సపేరును ప్రతిపాదించగా నాయకులంతా ఏకోన్ముకంగా ఆమోదం తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో నష్టపోయిన వైసిపి శాసన మండలిలో పట్టుకోల్పోకుండా జాగ్రత పడుతోంది. దీనికితోడు ఖాళీ అయిన విశాఖ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని బొత్సకు కట్టబెట్టడం ద్వారా మొత్తం ఉత్తరాంధ్రాలోని పార్టీ ఉనికిని నిలబెట్టుకునే పనిలో నిమగ్నమైంది. ఈకోణంలోనే బొత్సకు ఈ స్థానం కట్టబెడుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ స్థానంలో మొత్తం 841 ఓట్లు ఉన్నాయి. ఇందులో దాదాపు 615మంది వైసిపికి చెందినవారే. 215మంది టిడిపి చెందిన ఓటర్లు ఉండగా, మిగిలిన 11 ప్రజాప్రతినిధుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండడంతో బొత్సకూడా పోటీకి అంగీకరించినట్టుగా తెలుస్తోంది. అయితే, టిడిపి కూడా ఈ ఎన్నికల ద్వారా తన బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించే అవకాశాలు లేకపోలేదు. మరో ఐదేళ్ళు అధికారంలో ఉండనున్న నేపథ్యంలో వైసిపి నుంచి జంపింగ్‌లు కూడా ఉండవచ్చనే ఊహాగానాలు వ్యక్తమౌతున్నాయి. వాటి సంఖ్య ఎంత వరకు ఉంటుందనేది వేచిచూడాల్సిందే.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ కేశవనాయుడు, ఆర్‌డిఒలు, పోలీసు అధికారులు

హిట్ అండ్ రన్ బాధితులకు అవగాహన

ప్రజాశక్తి పార్వతీపురంటౌన్

హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న) కేసులలో బాధితులు పరిహారం కొరకు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి జె. కేశవనాయుడు తెలిపారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయంలో ఆయన చాంబరులో రెవిన్యూ, పోలీసు అదికారులు, బాధితులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వారి కుటుంబీలకు రూ.2లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు, పరిహారం అందించబడుతుందని తెలిపారు. కావున వెంటనే క్లెయిం కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. క్లెయిం చేసుకొనే విధానంపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత వాహనం గుర్తించినట్లయితే ఇన్సూరెన్స్ కూడా క్లెయిం చేసుకొనవచ్చునని, చాలామంది బాధితులు ఇన్సూరెన్స్ క్లెయిం చేసేందుకు వీలుపడదనే ఉద్దేశంతో హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు కేంద్రప్రభుత్వం అందించే పరిహారం క్లెయిం చేసేందుకు ముందుకురావడం లేదని, ఇన్సూరెన్స్ క్లెయింనకు, ప్రస్తుతం అందిస్తున్న పరిహారానికి సంబంధం లేదని, కావున హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులంతా ఈ పరిహారం పొందాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌డిఒలు కె.హేమలత, వివి రమణ, చినమేరంగి సిఐ బి.మంగరాజు, పార్వతీపురం టౌన్ ఎస్ఐ కె.ప్రయోగ మూర్తి పార్వతీపురం, టౌన్ ఎస్ఐ బి.సంతోషి, హిట్ అండ్ రన్ కేసులో చనిపోయిన కొమరాడ మండలం కోటిపాం గ్రామానికి చెందిన వేసముల ధర్మ చెల్లెలు వేసముల ప్రశాంతి, పార్వతీపురం పట్టణం వైకెఎం కాలనీకి చెందిన చందక సూర్య ప్రకాష్ బార్య చందక రాజేశ్వరి పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి తీవ్రమైన ద్రోహం చేసేలా ఉందని, దీనివల్ల రైతులకు చాలా ఇబ్బందికరమైన సమస్యలు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తుందని రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం చేసే కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొమరాడలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, అనంతరం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం వ్యవసాయానికి తీవ్రంగా నష్టం చేసే బడ్జెట్‌గా ఉందన్నారు. వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించడం ద్వారా గరిష్ట లాభాలు పొందేందుకు కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయని విమర్శించారు. వ్యవసాయ అనుబంధ రంగాల కేటాయింపుల్లో 21.2 శాతం కోత పడిందని, కనీసం మద్దతు ధర కల్పించి పంటల కొనుగోలుకు చర్యలు లేవని మండిపడతారు. అలాగే మన రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక హెూదా గానీ, విభజన హామీలకు గానీ, విద్య, వైద్యానికి నిధులు పెంచడంలో అన్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ను రైతులంతా తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, భవన కార్మికుల సంఘం నాయకులు యమక గౌరునాయుడు, గిరిజన సంఘం నాయకులు యు వెంకటేష్ ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి : జిల్లా జడ్జి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజలకు వైద్య శిబిరాల వల్ల ఎంతో అవసరమని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదర్‌రావు అన్నారు. మండలంలోని రావికోనలో మండల లీగల్ సర్వీస్ కమిటీ, రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్, ఐఆర్‌పిడబ్ల్యూఎ, డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరం మిమ్స్ హాస్పిటల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదర్ రావు మాట్లాడుతూ రావికోన వంటి మారుమూల గిరిజన గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఆవశ్యమన్నారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, చిన్నపిల్లల వ్యాధులు, మహిళల గర్భ కోశ వ్యాధులు తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు వైద్య పరీక్షలు చేయడం ముదావహమన్నారు. మలేరియా జ్వరాలపై దృష్టి పెట్టాలని, తగు మందులు తీసుకొని జాగ్రత్తపడాలని చెప్పారు. మలేరియాకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో దోమల బారినపడకుండా దోమతెరలు అందజేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించారు. ఈ సందర్భంగా జిపి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. రావికోన, చందలింగి, కొత్తవలస, అడ్డూరు వలస, ఆర్కే బట్టీ వలస గ్రామాలకు చెందిన దాదాపు 250 మందికి వైద్యపరీక్ష నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు స్త్రీలకు హైజినిక్ కిట్లు, రేకులు పాడైపోయిన ఇల్లులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బిఎన్‌బి రావు ఆధ్వర్యంలో సుమారు 300 పులిహార ప్యాకెట్లు, సిబ్బందికి అల్పాహారం అందజేశారు.

మొక్కలు నాటుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి వాగ్దేవి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, డాక్టర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.వివేక్, జయప్రకాష్ బాబు, అడ్డూరివలస పిహెచ్‌సి సిబ్బంది, రావికోన సర్పంచ్ రామస్వామి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు డాక్టర్ భోగేశ్వరరావ్, డాక్టర్ దుర్గాప్రసాద్, ఎన్జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్ కిషోర్, డాక్టర్ మధుసూదన్, నిమ్స్ పిఆర్ఒ శ్రీనివాసరావు, పార్వతీపురం, నిమ్స్‌కు చెందిన వైద్యులు, ఐఆర్‌పిడబ్ల్యూఎ, డైరెక్టర్ ప్రకాష్, లైన్స్ క్లబ్ సభ్యులు, రెడ్ క్రాస్ సభ్యులు, స్థానిక స్కూలు ప్రధానోపాధ్యాయులు రామారావు, కాంతమ్మ తదితరులు హాజరయ్యారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్

ప్రజాశక్తి -కురుపాం

పింఛన్ల పంపిణీ అక్రమాలకు పాల్పడిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్లలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో వాస్తవమని వెల్లడికావడంతో పాచిపెంట మండలం కేసలి పంచాయతీ గ్రేడ్ -4 కార్యదర్శి సేనాపతి సునీత, గ్రేడ్-5 గ్రామ కార్యదర్శి కోలక వాసులను సస్పెన్షన్ చేశారు. రెండు సంవత్సరాలు క్రితం మరణించిన వ్యక్తి పేర పింఛను పంపిణీ చేస్తున్నట్లు ధ్రువీకరణ కావడంతో సస్పెన్షన్ చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

సమాచార హక్కు చట్టం 2005పై మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ ఎడి కె.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక అగ్రిలాబ్ కార్యాలయంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల వ్యవసాయ అధికారులకు ఎడి మధుసూదనరావు, అగ్రిలాబ్ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టం అమలుపై అధికారులు లేవనెత్తిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

జనశక్తికాలనీలో కాలువల్లో రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

శివారు కాలనీలు... సమస్యలకు నిలయాలు

పట్టని అధికారులు... ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారు ప్రాంతాల్లో గల కాలనీల్లో నివసించే ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పించకపోవడంతో ఆయా కాలనీల్లో సమస్యలు దీర్ఘకాలంగా కొలువై ఉన్నాయి. పార్వతీపురం మున్సిపాలిటీ గ్రేడ్ వన్ స్థాయికి ఎదిగి పదేళ్లు దాటినా మున్సిపల్ పరిధిలో ఉన్న పలు వార్డులతో పాటు శివారు ప్రాంతాల్లో వెలసిన కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అటు పాలకవర్గ సభ్యులు గానీ, ఇటు మున్సిపల్ అధికారులు కానీ విఫలమయ్యారు. దీంతో పట్టణ ప్రాంతంలో ఉన్న పలు కాలనీలు అపరిశుభ్ర వాతావరణానికి నిలయాలుగా మారాయి. ముఖ్యంగా ఎస్ఎన్ మూర్తి నగర్, దేవీ నగర్, జనశక్తి కాలనీ, గణేష్ నగర్, సౌందర్య థియేటర్ వెనుక ఉన్న కాలనీ, కొత్తవలస శివారులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న రాజీవ్ కొత్తపోలమ్మ కాలనీల్లో సిసి రోడ్లు, కాలువలు, తాగునీటి పైపులైన్లు ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ఆయా కాలనీల్లో వందలాది కుటుంబాలు మట్టిరోడ్లే కనిపిస్తున్నాయి. దీని వల్ల అక్కడ ప్రజలు వర్షాకాలంలో ఏర్పడిన బురద వల్ల రోడ్లపైనే రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. శివారు కాలనీల్లో సిసి కాలువల్లేకపోవడంతో నివాస గృహాల వాడుక నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. దీనికి తోడు వర్షపు నీరు, వరహాలగెడ్డ వరద నీరు కాలనీలకు ఆనుకుని ఉన్న ప్రధాన రహదారులపై ప్రవహించడంతో రోడ్లు పాడవుతున్నాయి. ఆయా కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. రాత్రి వేళల్లో పలు కాలనీల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో నివాస గృహాలకు వెళ్లేవారు నానా అవస్థలకు గురవుతున్నారు. తాగునీటి పైపులైన్లు లేకపోవడంతో రెండు మూడు రోజులకు ఒకసారి మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. పలు కాలనీల్లో చెత్త సేకరణ కూడా సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ కార్యాలయానికి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తమ కాలనీల్లో మౌలిక సదుపాయాలపై మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు దృష్టి పెట్టకపోవడం విచారకరమని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. కొత్త ప్రభుత్వ హయాంలోనైనా శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు పాలకవర్గ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు చొరవ చూపెట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ధరల స్థిరీకరణకు అధికారుల చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడానికి, మార్కెట్లో సామాన్యులకు అందుబాటు ధరల్లో స్పెషల్ కౌంటర్లు ప్రారంభించామని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కౌంటర్లలో నాణ్యత కలిగిన కందిపప్పు, బియ్యం అందుబాటు ధరలకు విక్రయిస్తారన్నారు. ఈ కేంద్రాల్లో కందిపప్పు (దేశవాళీ రకం) కిలో రూ.160 నుంచి 150, బియ్యం (ఫైన్ స్టీం బియ్యం) కిలోకు రూ.49 నుంచి రూ.48, ఫైన్ ముడి బియ్యం కిలో రూ.48 నుంచి రూ.47 నిర్ణయించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతుబజార్లు, ఇతర షాపుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఎంఇఒపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి, జియ్యమ్మవలస ఎంఇఒ-1 నాగిరెడ్డి నాగభూషణరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సత్వరమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ డిఇఒ పి.కృష్ణ ఆధ్వర్యంలో నాగభూషణరావుపై కొద్ది రోజుల క్రితం యుటిఎఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో యుటిఎఫ్ నాయకులు పాల్గొని తమ ఆరోపణలు వివరించారు. ఎంఇఒ ఆ మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయుల నుంచి ప్రతి పనికి డబ్బులు వసూల చేయడం పనిగా పెట్టుకున్నారని, అలాగే మెడికల్ బిల్లులు ఎఎస్ కోసం లంచాలు వసూలు చేయడం వంటి వాటికి పాల్పడుతున్నారని అన్నారు. వీటన్నింటికీ ఫోన్ పే స్క్రీన్ షాట్‌లు, ఆడియో రికార్డింగ్‌లు విచారణ అధికారికి అందించామని, విచారణ అధికారులు నిజాయితీతో వ్యవహరించి తక్షణమే ఎంఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంఇఒను సస్పెండ్ చేయనిచో పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ విచారణకు ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా పార్వతీపురం ఎంఇఒ-1 కె.ప్రసాద్ వ్యవహరించారు.

విచారణలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

విద్యతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాశక్తి -బలిజిపేట

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాలేజీ ప్రిన్సిపల్ ఎం.జ్యోతి మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న 386 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్ ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

కొమరాడ : ప్రతి ఒక్కరూ బాగా చదువుకుంటే వారి జీవితం ఉన్నతంగా మలుపు తిరిగేందుకు అవకాశం ఉందని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన నోట్ పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఉద్యోగం సంపాదించి వారి కుటుంబం మొత్తం ఆర్థికంగా నిలదొక్కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక తహశీల్దార్ ఎం.రవణమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కలెక్టరేట్లో పనిచేస్తూ బదిలీపై కురుపాం వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అధికారులను, ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ తమ పరిధిలో ఉన్నటువంటి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరించి ప్రజలకు మంచి పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు.

టెండర్లు తెరుస్తున్న ఐటిడిఎ పిఒ రాహుల్‌కుమార్‌రెడ్డి

కూరగాయల సరఫరాకు టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఏకలవ్య పాఠశాలకు కూరగాయలు, చికెన్ సరఫరా చేయడానికి ఐటిడిఎలో శుక్రవారం టెండర్ నిర్వహించారు. టెండర్ బాక్సును ఐటిడిఎ పిఒ రాహుల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టెండరుదారులు నాణ్యమైన కూరగాయలను పాఠశాలలకు, కళాశాలకు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎపిఒ గణేష్, ఎటిడబ్ల్యుఒలు మంగవేణి, శ్రీనివాసరావు, జిసిసి మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

క్వారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

క్వారీలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇప్పలవలస, నిడుగల్లు గ్రామాల వద్ద ఉన్న క్వారీలను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్వారీలో భద్రతా నియమాలను పాటించడంలేదని, గ్రీన్ బెల్ట్ లేదని, దీంతో గ్రామాల్లోకి దుమ్ము, ధూళి వస్తున్నాయని తెలిపారు. వీటిపై మైనింగ్ అధికారులను అడగ్గా వీటిని నిలిపివేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు, నాయకులు కె.అరవింద్ కుమార్, బి.చిరంజీవి, బి.లక్ష్మణరావు, కుడుమల సూర్యనారాయణతో పాటు పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం వేస్తూ, ఎస్సీలో ఉన్న ఉపకులాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య కోరారు. జిల్లా కేంద్రంలో పట్టణంలోని గంటా బడి ఏరియాలో ఎస్సీ యువకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీలను ఎ, బి, సి, డిలుగా వర్గీకరించాలని సిపిఐ ఎప్పటి నుంచో చెబుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల సిపిఐ వర్షం వ్యక్తం చేస్తుందన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న కలప

అనుమతుల్లేని టేకు కలప స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

అనుమతుల్లేకుండా వ్యాన్‌తో తరలిస్తున్న టేకు కలపను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.సింహాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం నుండి పాలకొండ టేకు కలప తరలిస్తుండగా పాలకొండ పరిసర ప్రాంతాల్లో కలపతో పాటు వ్యాను పట్టుకుని కురుపాం ఫారెస్ట్ కార్యాలయానికి తీసుకొచ్చామన్నారు. అయితే అది రైతు వద్ద కలపే అయినప్పటికీ అటవీశాఖ అధికారుల అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతి పత్రాల్లేనందున పట్టుకొని అపరాద రుసుం వేయశామన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు

తాగు నీరొచ్చిందోచ్...

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం ద్వారా శుక్రవారం నీరొచ్చింది. గత నెల 30న చుక్క నీరువ్వని రక్షిత నీటి పథకం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి పంచాయతీ యంత్రాంగం స్పందించి రక్షిత మంచినీటి పథకం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పథకం వద్ద ఏర్పాటు చేసిన ట్యాపుల ద్వారా నీరొచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఘనంగా పిసి రాయ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పాలకొండ

ప్రముఖ రసాయన శాస్త్రవేత్త పిసి రాయ్ జన్మదిన వేడుకలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపల్ శ్యాం బాబు రాయ్ గొప్పతనాన్ని, రసాయన శాస్త్ర అభివృద్ధిలో ఆయన చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరావు, ఎస్.జగన్‌మోహనరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్, జయమణి, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ రాజు, అర్థశాస్త్ర ఉపన్యాసకులు శాంతి, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

టొబాకోపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టొబాకో ఫ్రీ ఎడ్యుకేషన్‌పై ఇనిస్టిట్యూషన్ అనే అంశంపై అవగాహన శుక్రవారం కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుశాంత్ జన మాట్లాడుతూ పొగాకు వాటి అనుబంధ ఉత్పత్తులు సేవించడం ద్వారా కొద్ది క్షణాల ఆనందం కొనుగుతుందని, ఆ తర్వాత నష్టం జరుగుతుందని అన్నారు. దీనివల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. కావున వీటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పిఒను కలిసిన గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డిని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న అధికారులు పోస్టులు నియమించాలని కోరారు. అలాగే ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ నియామకం జరపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నారాయణరావు, ఎం.రవికుమార్, సూరిబాబు, ధర్మారావు, జయరాం, సూర్యం, రాములమ్మ తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఒను కలిసిన గిరిజనసంక్షేమశాఖ ఉపాధ్యాయుల సంఘం నాయకులు

తల్లిపాలతో విలువైన పోషకాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తల్లిపాలలోనే విలువైన పోషక పదార్థాలు ఉన్నాయని, కావున ప్రతి తల్లి ఆరు మాసాల వరకు శిశువులకు ముర్రు పాలు అందించాలని డాక్టర్ వై.విజయమోహన్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా కేంద్రాసుపత్రి పిపి యూనిట్ విభాగం శుక్రవారం ఐసిడిఎస్ కార్యాలయం నుంచి జిల్లా కేంద్రాసుపత్రి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు ఆరు నెలల వయస్సు వరకు ముర్రు పాలే పట్టాలని, తల్లి పాలలో ఉన్న పోషక విలువలు రోగనిరోధక శక్తిని తెలియజేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి గ్రామంలోనూ ప్రతి తల్లికి, తండ్రికి గ్రామస్తులకు అవగాహన కల్పించి నూటికి నూరు శాతం తల్లులంతా కూడా తమ 6 నెలల లోపు పిల్లలకు ముర్రు పాలే పట్టేలా చూడాలని తెలిపాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, బాలికల అక్రమ రవాణా, గృహ హింసా నిషేధ చట్టం 2005, పనిచేసే ప్రదేశాల్లో స్త్రీలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బి శ్రీనివాసరావు, సిడిపిఒ శ్రీనివాసరావు, సూపర్ వైజర్లు డి.పుష్ప, హెల్త్‌విజిటర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కారమని సూపర్వైజర్ పైల జానకమ్మ అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలు ఆవశ్యకత గూర్చి గ్రామంలో ర్యాలీ నిర్వహించి గర్భిణీలు, బాలింతలకు పుట్టిన బిడ్డకు ముర్రుపాలే మొదట టీకాగా పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా రోగనిరోధక శక్తి పెంపొందించే గుణాలు అధికంగా ఉంటాయన్నారు. కావున తల్లిపాలే బిడ్డలకు పెట్టాలి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలో అంగన్వాడీలు, వైద్య సిబ్బంది గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని తల్లిపాలు వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు గాదిలంక, కంబరవలస, కంబర తదితర గ్రామాల్లో తల్లిపాలు ఆవశ్యకతపై గర్భిణీలకు, బాలింతలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఒ.శాంత కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్.రాజేశ్వరి, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెదభోగిలిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.పావని మాట్లాడుతూ తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవి అని, ప్రతి తల్లి బిడ్డకు ఇవ్వాలని అన్నారు. రోగనిరోధక శక్తి పెరిగే ఎటువంటి జబ్బులు కూడా పిల్లలకు రానీయకుండా చేస్తుందన్నారు. అనంతరం కొంతమందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి రమణ, పిఎన్ సత్యవతి, వైద్య సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : పుట్టిన ప్రతిబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయని, తల్లిపాలు పసిపిల్లలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచి భవిష్యత్తులో వారు రోగాల బారిన పడకుండా ఉంటారని ప్రతి తల్లికీ అవగాహన కల్పించడమే తల్లిపాల వారోత్సవ లక్ష్యమని ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.విజయగౌరి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 1 నుంచి 7 వరకు కురుపాం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. శుక్రవారం పెదమేరంగి పంచాయతీ రామనాయుడువలసలో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ముందుగా గ్రామంలోని తల్లిపాలు వారోత్సవ నినాదాలతో ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అంగన్వాడీ కేంద్రాలలో తల్లుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్ర నిర్వాహకులు రాణిబి, దివి రత్నం, విజయలక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, బిడ్డకు అనారోగ్యాలు నుంచి దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం బొత్స శ్రీదేవి, సచివాలయ సిబ్బంది గొర్లి భవానీ, నందివాడ శ్రీకాంత్, అంగన్వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా బుక్కూరులో బాలింతలకు, గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. రెండేళ్ల వరకు బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని ఎంఎల్‌హెచ్‌పి కమల జోషి, ఎఎన్ఎం ఎస్.రాజేశ్వరి అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది ఎన్.హేమప్రభ, దివ్య, ఇందిరా, గంగమ్మ ఉన్నారు

సీతానగరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

పార్వతీపురంలో ర్యాలీన ఇర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం మండలం నీలకంఠాపురంలో ర్యాలీన ఇర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మూడు వైపుల ప్రయాణమూ ముప్పే

ప్రజాశక్తి - మక్కువ

మండలానికి సాలూరు, బొబ్బిలి, చినబోగిలి నుంచి వచ్చే రహదారులపై ప్రయాణించాలంటే ఎక్కడ ఏ ప్రమాదంతో ముప్పు వాటిల్లుతోందనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్ళుగా ఈ మూడు ప్రాంతాలకు ప్రధాన రహదారుల పూర్తి అధ్వానంగా తయారయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.వంద కోట్లు పైబడి సాలూరు, చినబోగిలి రెండు రహదారులకు నిధులు మంజూరయ్యాయి. 2023 సంవత్సరంలో రహదారులకు ఎర్త్ వర్క్ పనులు కూడా చేపట్టార.ు కాంట్రాక్టర్‌కు బిల్లులు సక్రమంగా అందకపోవడంతో రోడ్డు పనులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఎర్త్ వర్కులు పైప్ లైన్ కల్వర్టులు వేసి వదిలేయడంతో రహదారులు పూర్తిగా అధ్వాన స్థితికి మారిపోయాయి. దీంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురానికి వెళ్లాలన్న ఇబ్బందులు తప్పడం లేదు. అది అలా ఉంటే పారాది వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ రహదారుల గుండా భారీ వాహనాలు తిరగడతో రహదారులు రూపమే లేకుండా పోయాయి.

దారుణంగా తయారైన రహదారులు

సాలూరు నుంచి మక్కువ వస్తున్న రోడ్డు దుస్థితి

ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా మండల ప్రజల అవస్థలు గుర్తెరిగి వెంటనే రహదారులు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యాలయమే పాఠశాల

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పులిగుమ్మిలో పాఠశాల పూర్తిగా శిథిలమై కూలిపోయే పరిస్థితిలో ఉండడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు ఆ గ్రామపంచాయతీ పంచన చేరి విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు 70 మంది విద్యార్థులతో కళకళలాడిన ఈ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాల్లేకపోవడంతో ఈ గ్రామానికి సమీపంలోని బందలుప్పిలో ఉన్న ఒక ప్రైవేటు కాన్వెంట్‌కు విద్యార్థులు వెళ్లిపోతున్నారు. దీంతో విద్యార్థులు లేకపోవడంతో స్కూలు మూసివేసే పరిస్థితి దాపురించింది. దీంతో ఆ గ్రామ సర్పంచ్ బేత బాలకుమారి, ఏకైక ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు కృషితో ఒక ఐదుగురు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం వీరితోనే ఈ పాఠశాల కొనసాగుతోంది. అయితే గ్రామంలో ఉన్న పాఠశాల శిథిలాస్థితికి చేరుకున్నప్పటికీ దానిలోనే ఉపాధ్యాయుడు పాఠాలు బోధించడం కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల భవనం కూలిపోయే స్థితికి రావడంతో ఉపాధ్యాయుడు విద్యార్థులను పంచాయితీ కార్యాలయానికి తరలించి వరండాలోనే క్లాసులను కొనసాగిస్తున్నారు. అయితే ఉన్న ఐదుగురులో ఒకటి నుండి 5 క్లాసుకు చెందిన విద్యార్థులు ఉండడం విశేషం. ఇటీవల గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 3,4,5 తరగతుల విద్యార్థులు సమీపంలోని హై స్కూలుకు తరలివెళ్లాల్సి ఉండగా, నిర్ణీత దూరం నిబంధనతో ఆ ముగ్గురు పిల్లలు మిగిలారు. దీంతో ఐదుగురు విద్యార్థులతోనే ఉపాధ్యాయుడు పాఠశాలను కొనసాగిస్తున్నారు.

పులిగుమ్మి సచివాలయ ఆవరణలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి స్థాయి పెరిగి, నిధులు ఉన్నా భవన నిర్మాణాలు, ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఆసుపత్రిలో ఉన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు, రిఫరల్ కేసులు తగ్గించేందుకు పాలకులు, అధికారులు కషి చేయాలని కోరారు. జిల్లా కేంద్రంతో సహా పలు ప్రాంతాల్లో కుక్కలు చేస్తున్న దాడులపై అధికారులు స్పందించాలని కోరారు. కుక్కల దాడిలో మనుషుల ప్రాణాలు పోతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న దళిత నాయకులు

ఎస్‌సి వర్గీకరణపై నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టు తీర్పును పున: పరిశీలన చేయాలని కొన్ని కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా సర్వోన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించడం బాధాకరమని, రాజ్యాంగ చట్ట వ్యతిరేకంగా ఈ తీర్పు ఉందని, కులగణన జరగకుండా వర్గీకరణ సాధ్యం కాదని పాలకొండలో దళిత నాయకులు ఎద్దు లిల్లీ పుష్పనాథం, ఎస్ భరత భూషణ్ , బత్తిన మోహన్ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున దళిత సంఘాల నాయకులు, ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు సంఘ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు ఉద్యోగ సంఘాల నాయకులు బబురు గణేష్ మాట్లాడుతూ దళిత ఉద్యోగ కుటుంబాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమాన్ని దేశస్థాయిలో తీసుకువెళ్తామన్నారు. అమరావతిలో మాలల గర్జన సభ నిర్వహిస్తామన్నారు. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని, సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అప్పీలుకు వెళ్తామని తెలిపారు. అనంతరం యాలం కూడలిలో మానవహారం చేపట్టారు. భవిష్యత్ కార్యాచరణ కొద్దిరోజుల్లో ప్రకటిస్తామని, రాష్ట్ర నాయకత్వాన్ని అనుసరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు, దళిత యువసేన సభ్యులు రాకోటి వెంకటరావు, మడపల ప్రసాదరావు, తిర్లంగి ఉపేంద్ర, బొంతు గవరయ్య, యలగడ రాజు కుమార్, పొట్నూరు రమేష్,ఉద్యోగ సంఘాల సభ్యులు దళిత యువత పాల్గొన్నారు.

పాలకొండ- వీరఘట్టం మలుపు వద్ద గోడ నిర్మిస్తున్న అధికారులు

ప్రమాదం జరిగితే గాని స్పందించరా?

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి సమీపాన చిదిమి గ్రామ జంక్షన్ వద్ద గల ప్రధాన మలుపు వద్ద ప్రమాదాలు జరిగితే గాని స్పందించరా అంటూ? అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెల 21న ఇదే ప్రధాన మలుపు వద్ద పాలకొండ నుండి రాయగడ వైపు వెళ్తున్న లారీ వంతెనకు ఒకవైపునున్న రక్షణ గోడను ఢీ కొట్టి పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో ప్రమాదం జరిగిన స్థలాన్ని పాలకొండ డిఎస్పి జివి కృష్ణారావు పరిశీలించారు. ఇక్కడ ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బార్కేట్లతో పాటు డబ్బాలు కూడా ఏర్పాటు చేశారు. మొద్దు నిద్రలో ఉన్న రోడ్లు, భవనాలు అధికారులు గత రెండు రోజుల నుండి అక్కడ గోడను కడుతున్నారు .

విఆర్‌ఎల నైట్ డ్యూటీలను వెంటనే ఉపసంహరించాలి

ప్రజాశక్తి -కురుపాం

గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల (విఆర్ఎ) నైట్ డ్యూటీలను వెంటనే ఉపసంహరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కురుపాంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ విఆర్ఎలపై రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా మోపిన నైట్ డ్యూటీలను ఉపసంహరించుకోవాలని, నిలుపుదల చేసేలోపు ప్రత్యేక అలవెన్స్ ఇచ్చి, భద్రత కల్పించాలని, మహిళలతో రాత్రి పూట డ్యూటీలు వెంటనే ఆపి తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలో కూడా పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3న స్థానిక ఎంఆర్‌లకు, ఆగష్టు 6న ఆర్‌డిఒలకు, 9న జిల్లాకలెక్టర్లకు ఆగష్టు 14,15 తేదీల్లో మంత్రులు, ఎంఎల్‌ఎలకు రాయబారాలు నిర్వహించే కార్యక్రమానికి విఆర్ఎలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

అత్తవారి గ్రామంలో మృతిపై అనుమానాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్న శిర్లాం గ్రామ దళిత కాలనీలో ఉన్న తాగునీటి బావిలోకి దూకి ఆర్.ఆముదాలవలస గ్రామానికి చెందిన కుమిలి రాంబాబు (32) శుక్రవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. రాంబాబు గ్రామదేవత వారాలకు అత్తవారింటికి చిన్న శిర్లాం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అత్తవారింటిలో ఏమి జరిగిందో కానీ అకస్మాత్తుగా బావి దగ్గరికి వెళ్లి బావిలో దూకారు. రాంబాబు బావిలో దూకడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు, రేగిడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఈ శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బావిలో ఎక్కువ నీరు ఉండడం, రాంబాబు మృతదేహం పైకి తేలకపోవటంతో ఇంజన్ సహకారంతో నీటిని తోడించారు. మధ్యలోనే ఇంజిన్ మొరాయించడంతో ఈత గాల్లను బావిలోకి దించడంతో మృత దేహం లభ్యమైంది. పంచనామ నిర్వహించి, రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అత్తవారి గ్రామంలో మృతిపై అనుమానాలు

కుమిలి రాంబాబు రేగిడి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న గోదాంలో కళాసిగా పనిచేస్తున్నారు. అత్తవారి ఇంటి వద్ద బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భార్యాభర్తలకు గతంలో తగాదాలు ఉండటంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయని చెబుతున్నారు. రాంబాబు మద్యం సేవించి నిత్యం ఇంటికి వచ్చి భార్యతో గొడవలకు దిగుతాడని సమాచారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చాక అసలు విషయం తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య సంతోషి, ఒక ఆడపిల్ల సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు..

నేరాలు ఘోరాలు

పాము కాటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన యువకుడు కె.సుధీర్ (27) పాము కాటుతో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాలు మేరకు.. సుధీర్ కల్లానికి వెళుతుండగా పాము కాటు వేసినప్పటికి గమనించలేదు. బహిర్భూమికు చెరువుకు వెళ్లగా కాలుకు రక్తం రావడంతో చెరువులో నీటితో రక్తం కడిగి స్నేహితులతో 30 నిమిషాలు వరకూ మాట్లాడాడు. కాలు లాగినట్లు ఉండడంతో స్నేహితులకు చెప్పగా మోటారు సైకిల్‌పై ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అప్పటికే సుధీర్ మరణించినట్లు వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామభద్రపురంలో భారీ చోరీ

25 తులాల బంగారం అపహరణ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో గురువారం తెల్లవారు జామున భారీ చోరీ జరిగింది. పప్పు ఈశ్వరరావు తన కుటుంబ సభ్యులతో తీర్థ యాత్రలకు వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు ఈ చోరీకి ప్లాన్ వేశారు. తమ ఇంటిలో బీరువా లాకర్‌లో భద్రపరచిన సుమారు 25 తులాల బంగారం, అరకేజీ వెండి అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని విజయనగరం క్లూస్ టీమ్ పరిశీలించింది. సంబధిత ఎస్ఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో వేలిముద్రల నమూనాలు సేకరించారు. బాడంగి ఎస్ఐ జయంతి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులతో చోరీ తీరుపై వివరాలు సేకరించారు. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ దొంగతనం జరగడం విశేషం. ఇటీవల కాలంలో మండలంలో ఎక్కువగా చోరీలు జరగడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల ముందే మండల కేంద్రంలో ఉన్న స్టేట్ బ్యాంకు కష్టమర్ సర్వీస్ పాయింట్లో చోరీ జరగడం, సోంపురం వెళ్లే దారిలో ఒకింటిలో చోరీ జరగడం, ఆరికతోట, బుసాయవలస వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో హుండీని చోరీచేయడం వంటి సంఘటనలు జరగడంపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ చోరీలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.